సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

ఆదివారం। 29। జనవరి। 2023



టన్ను చీనీ రూ.30 వేలు
అనంతపురం మార్కెట్‌యార్డులో శనివారం టన్ను చీనీకాయలు గరిష్ట ధర రూ.30 వేలు పలికాయి. మార్కెట్‌కు 33 టన్నులు రాగా .. ఈ–నామ్ పద్ధతిలో వేలం వేశారు.



టమాట కిలో రూ.14
అనంతపురం శివారులోని కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.14, కనిష్టం రూ.5, సరాసరి రూ.9 ప్రకారం అమ్మకాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
31.8°/9.1°

జిల్లా అంతటా శనివారం చలి తీవ్రత కొద్దిగా పెరిగింది. గాలివేగం కూడా స్వల్పంగా పెరిగింది. పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా కొనసాగాయి. గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో ఆగ్నేయం దిశగా గాలి వీచింది.

వీరాపురానికి విదేశీ అతిథి





ఎక్కడ సైబీరియా... ఎక్కడ చిలమత్తూరు మండలంలోని వీరాపురం. దాదాపు 5 వేల కిలోమీటర్ల దూరం. ఎందులోనూ పొంతన ఉండదు. కానీ ఈరెండు ప్రాంతాలను ఓ పక్షి కలిపింది. అతిథిగా వచ్చి ఇక్కడి ప్రజల మనస్సు గెలుచుకుంది. ఈ ప్రాంతానికి గుర్తింపు తెచ్చింది. అందుకే ఏటా జనవరి నుంచి ఫిబ్రవరిలోపు ఇక్కడికి వచ్చి సందడి చేసే ఆ అతిథి కోసం వీరాపురం ఎదురుచూస్తోంది. – సాక్షి, పుట్టపర్తి

సైబీరియా టు వీరాపురం
- మూడు శతాబ్దాలుగా పెనవేసుకున్న అనుబంధం
- ఏటా ఫిబ్రవరి మొదటివారంలో పక్షుల రాక
- సంతానం వృద్ధి చెందాక స్వదేశానికి పయనం
- ఆరు నెలలు సందడి చేయనున్న ఎర్రకొంగలు

వీరాపురం.. శ్రీ సత్యసాయి జిల్లా చిలమత్తూరు మండలంలో కర్ణాటక సరిహద్దున ఓ మారుమూల గ్రామం. కానీ ఆ గ్రామానికి అంతర్జాతీయంగా గుర్తింపు వచ్చింది. అదీ ఓ అతిథి వల్ల. అందుకే ఆ అతిథికి గ్రామస్తులు రాచమర్యాదలు చేస్తారు. ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూసుకుంటారు.

వేడిని వెతుక్కుంటూ..
రష్యా దేశం సైబీరియన్ ప్రాంతానికి చెందిన స్టార్క్ పెయింటెడ్ పక్షులు (ఎర్రముక్కు కొంగలు) సమశీతోష్ణస్థితి కలిగిన ప్రాంతాల్లో జీవిస్తాయి. ఈ క్రమంలోనే వచ్చే ఫిబ్రవరి నుంచి సైబీరియాలో చలికాలం ప్రారంభమవుతుంది. ఉష్ణోగ్రత మైనస్ డిగ్రీలకు పడిపోతుంది. దీంతో వేడిని వెతుక్కుంటూ ఈ పక్షులు మైళ్ల దూరం ప్రయాణించి ఏటా వీరాపురం వస్తుంటాయి. ముందుగా జనవరిలోనే కొన్ని పక్షులు వచ్చి ఇక్కడి వాతావరణ పరిస్థితులను పరిశీలిస్తాయి. అనుకూలంగా ఉందని నిర్ధారించుకున్న తర్వాత తమ దేశానికి వెళ్లి మిగతా పక్షులతో తిరిగి వస్తాయి. ఇలా మన రాష్ట్రంలోని కొల్లేటి సరస్సు, తేలినీలాపురం, పులికాట్ సరస్సు, నేలపట్టుతో పాటు మన జిల్లాలోని చిలమత్తూరు మండలం వీరాపురం గ్రామానికి ఏటా సైబీరియన్ పక్షులు రావడం మూడు దశాబ్దాలుగా ఆనవాయితీగా కొనసాగుతోంది.



వీరాపురం వద్ద ఏర్పాటు చేసిన సైబీరియన్ పక్షుల ప్రతిమ

ఆరు నెలల పాటు సందడి..
వీరాపురంలోని 188 ఎకరాల విస్తీర్ణంలో పురాతనమైన చెరువు ఉంది. దీని కింద 80 ఎకరాల ఆయకట్టుంది. దీని చుట్టూ వందలాది చెట్లు ఉండటంతో మూడు దశాబ్దాలుగా సైబీరియా నుంచి వేల సంఖ్యలో ఈ పక్షులు ఫిబ్రవరిలో ఇక్కడకు వస్తున్నాయి. ఇక్కడే గుడ్లు పొదిగి పిల్ల పక్షులు ఎగిరే దశకు చేరుకున్నాక (సెప్టెంబర్ నుంచి అక్టోబర్ లోపు) తిరిగి స్వస్థలానికి వెళ్లిపోతాయి. వీటిని స్థానికులంతా ప్రేమగా ఎర్రముక్కు కొంగలంటారు. కొన్నేళ్లుగా వీరాపురంతో ఈ పక్షులు మమేకమయ్యాయి. అందువల్లే సీజన్‌లో పక్షులను చూసేందుకు పర్యాటకులు భారీగా తరలివస్తుండగా... వీరాపురం కళకళలాడుతుంది.

బంధువుల్లా ఆదరణ..
తమ గ్రామానికి ఖ్యాతి తెచ్చిన ఈ కొంగలను వీరాపురం వాసులు ప్రత్యేకంగా చూస్తారు. ఇళ్ల మధ్య చెట్లపైనే ఉంటూ 24 గంటలూ అరుస్తూ ఉన్నా వాటికి ఎలాంటి ఇబ్బంది కలగనివ్వరు. అంతేకాకుండా వీరాపురం చెరువును చారిత్రక సంపదగా ప్రకటించారు. చెరువు కింద 80 ఎకరాల ఆయకట్టు ఉన్నా... ఈ చెరువు నీటితో వ్యవసాయం చేస్తే నీరు తగ్గిపోయి మత్స్యసంపద అంతరిస్తుందని, అప్పుడు సైబీరియన్ పక్షులకు ఆహారం లేకుండా పోతుందన్న భయంతో ఏకంగా చెరువు కింద ఆయకట్టులో వ్యవసాయం చేయడమే మానేశారు.

మేలు జరుగుతుందని నమ్మకం..
ఈ కొంగల రాకతో ఊరికి మేలు జరుగుతుందని వీరాపురం వాసులు నమ్ముతారు. ఎవరైనా వాటికి హాని తలపెడితే అందరూ ఒక్కటవుతారు. వారిని పట్టుకుని గ్రామపెద్దల సమక్షంలో పంచాయితీ చేసి జరిమానా విధిస్తారు. కేసులు పెడతారు. సైబీరియా నుంచి సుమారు ఐదు వేల కిలోమీటర్లు ప్రయాణించి ఈ కొంగలు వీరాపురం చేరుకుంటుండడం విశేషం.

పోషణ భారం ఆడ కొంగలదే..
పెయింటెడ్ స్టార్క్ పక్షి చూడముచ్చటగా ఉంటుంది. సికొనిడే జాతికి చెందిన ఈ పక్షి శాస్త్రీయ నామం 'మిక్టీరియాలూకోసిఫల'. ఎత్తు 3 నుంచి 3.5 అడుగులు. ఎగరడానికి రెక్కలు విప్పినప్పుడు ఐదు అడుగుల వెడల్పు ఉంటుంది. బరువు సుమారు 3.5 కిలోల నుంచి 4 కిలోల వరకు ఉంటుంది. ఈ పక్షులు నీళ్లను గొంతు వరకు నింపుకొని పిల్ల పక్షులకు అందించేందుకు మొత్తం నీరు బయటకు తీసి ఇవ్వడం ఆశ్చర్యంగా ఉంటుంది. ఆహారం కోసం ఊరికి 50 కిలోమీటర్ల దూరంలోపు ఉండే చెరువులు, పంట పొలాల వైపు వెళ్లి తిరిగి సాయంత్రం గూటికి చేరుకుంటాయి. ఒక గూడులో జంట పక్షులుంటాయి. గుడ్లు పెట్టి పిల్లలు వచ్చాక వాటి సంరక్షణను మగపక్షి చూసుకుంటుంది. ఆడకొంగలు బయటకు వెళ్లి చెరువుల్లో వేటాడి చేపలు, నీళ్లు తీసుకొచ్చి పిల్లలకు అందిస్తాయి.

అనువైన వాతావరణం



సైబీరియాతో పోలిస్తే వీరాపురంలో వేడి వాతావరణం ఉండటం, వేసవిలోనూ దగ్గరలోని చెరువుల్లో నీళ్లుండటంతో పక్షులు మా ఊరికే వస్తుంటాయి. కేవలం చేపలను మాత్రమే ఆహారంగా తీసుకుంటాయి. తమ పిల్లలకు కూడా మేత తీసుకొస్తాయి. – ఎల్.లక్ష్మీపతి, వీరాపురం గ్రామ పంచాయతీ సర్పంచ్

విడదీయరాని బంధం



ఒంటరిగా వచ్చే ఈ పక్షులు గుడ్లు పెట్టి పొదిగి పిల్లలతో పాటే తిరిగి సైబీరియా వెళ్లిపోతాయి. మా తాతల కాలం నుంచి ఈ పక్షులు వస్తున్నాయి. పక్షులతో మా గ్రామానికి విడదీయరాని అనుబంధం. ఏటా పక్షుల సీజన్ కోసం ఎదురు చూస్తుంటాం. – నరసింహారెడ్డి, వీరాపురం

సూర్యప్రభ వాహనంపై శ్రీవారు



ఖాద్రీశుని దర్శనానికి క్యూలో బారులు తీరిన భక్తులు

కదిరి టౌన్: రథ సప్తమి సందర్భంగా శనివారం ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి సూర్య వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీదేవి, భూదేవి సమేత వసంత వల్లభునికి తిరుమాడ వీధుల్లో విహరిస్తుండగా, దర్శనానికి భక్తజనం పోటీ పడ్డారు. అంతకుముందు రంగమండపంలో రకరకాల పూలతో స్వామివారి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్, ఆలయ చైర్మన్ గోపాలకృష్ణ,పాలక మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన ఖాద్రీ ఆలయం..
శనివారం, రథసప్తమి కలిసిరావడంతో ఖాద్రీశుని దర్శనం కోసం భక్తులు భారీగా తరలివచ్చారు. కదిరి పరిసరాల ప్రాంతాల నుంచే కాకుండా వైఎస్సార్ కడప, చిత్తూరు జిల్లాలతో పాటు కర్ణాటక రాష్ట్రం నుంచి కూడా భక్తులు భారీగా తరలి రావడంతో ఖాద్రీ ఆలయం కిటకిటలాడింది. భక్తుల గోవింద నామస్మరణతో మార్మోగింది.



సూర్య వాహనంపై భక్తులకు దర్శనమిస్తున్న ఖాద్రీశుడు

ఎమ్మెల్సీ ఇక్బాల్‌కు పితృవియోగం

- అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందిన గౌస్‌సాబ్



హిందూపురం: ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్‌కు పితృవియోగం కలిగింది. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఎమ్మెల్సీ తండ్రి గౌస్‌సాబ్ (94) కర్నూలు ఆస్పత్రిలో చికిత్సలు పొందుతూ శనివారం మధ్యాహ్నం మృతి చెందారు. 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఉన్న ఇక్బాల్‌కు విషయం తెలియగానే ఆయన కర్నూలు బయలుదేరి వెళ్లారు.

నిరాడంబర జీవితం..
కర్నూలులో టౌన్ మోడల్ స్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ పదవీ విరమణ పొందిన గౌస్‌సాబ్..ఎందరినో విద్యావంతులుగా తీర్చిదిద్దారు. జీవితమంతా నిరాడంబరంగా గడిపారు. సర్వమతాల సారం ఒక్కటేనని చెప్పే గౌస్‌సాబ్... భగవద్గీత పారాయణం చేస్తూ ధనగుణాన్ని అలవర్చుకోవాలని సూచించేవారు. గౌస్‌సాబ్ మృతికి వైఎస్సార్‌సీపీ నాయకులు సంతాపం తెలిపారు. ఆదివారం కర్నూలు లక్ష్మీనగర్‌లోని రోజా దర్గాలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబీకులు తెలిపారు.

రెండు ఎంపీపీ స్థానాలకు 3న ఎన్నికలు

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లాలో ఖాళీగా ఉన్న విడపనకల్లు, చెన్నేకొత్తపల్లి ఎంపీపీ స్థానాలకు ఫిబ్రవరి మూడో తేదీన ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. చెన్నేకొత్తపల్లి ఎంపీపీ శ్రీశైలం ప్రవీణ పదవికి రాజీనామా చేసి.. ఎంపీటీసీ సభ్యురాలిగా కొనసాగుతున్నారు. అలాగే విడపనకల్లు ఎంపీపీ బోయ రత్నమ్మ కూడా పదవికి రాజీనామా చేసి ఎంపీటీసీగా కొనసాగుతున్నారు. దీంతో రెండు ఎంపీపీ స్థానాలకు ఎన్నిక అనివార్యమైంది.

న్యూస్‌రీల్

మళ్లీ పెరిగిన చలి
అనంతపురం అగ్రికల్చర్: చలితీవ్రత మళ్లీ పెరిగింది. వారం రోజులుగా పెరుగుతూ వచ్చిన రాత్రి ఉష్ణోగ్రతలు మరోసారి తగ్గుముఖం పట్టాయి. దీంతో రాత్రిళ్లు, వేకువజామున చలి గింతలు పెరిగాయి. శనివారం సత్యసాయి జిల్లా మడకశిరలో 9.1 డిగ్రీలు, అనంతపురం జిల్లా బెళుగుప్పలో 9.6 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చాలా మండలాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు తగ్గడంతో శీతల వాతావరణం నెలకొంది. 27 నుంచి 32 డిగ్రీల మధ్య పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదవుతున్నాయి. శనివారం మిగతా ప్రాంతాల్లో నమోదైన ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే... అగళి 9.2 డిగ్రీలు, రొద్దం 9.5, తనకల్లు 9.6, సోమందేపల్లి 10.2, అమడగూరు 10.3, నల్లచెరువు 10.4, శెట్టూరు 10.5, పరిగి 10.7, లేపాక్షి 10.8, ఓడీ చెరువు 10.9 డిగ్రీలు నమోదు కాగా మిగతా మండలాల్లో 11 నుంచి 15 డిగ్రీల మధ్య కనిష్టం నమోదయ్యాయి.

'సెబ్' సూపరింటెండెంట్‌గా రవికుమార్



పుట్టపర్తి అర్బన్: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) సూపరింటెండెంట్‌గా ఎస్.రవికుమార్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు శనివారం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. రవికుమార్ గతంలో పెనుకొండలో విధులు నిర్వర్తించేవారు. సోమవారం ఆయన బాధ్యతలు చేపట్టనున్నట్లు తెలిసింది.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- కేంద్ర బృందంతో కలెక్టర్ బసంత్‌కుమార్



కేంద్ర కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ బసంత్‌కుమార్

పుట్టపర్తి టౌన్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందిస్తున్నామని కలెక్టర్ బసంత్‌కుమార్ కేంద్ర బృందం సభ్యులకు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరును తెలుసుకునేందుకు శనివారం ఎన్‌ఎల్‌ఎం (నేషనల్ లెవల్ మానిటరింగ్) సభ్యులు ప్రదీప్ కుమార్, సంతోష్ కుమార్ ప్రదాస్ జిల్లాకు విచ్చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ తన చాంబర్‌లో వారితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని 3.65 లక్షల కుటుంబాలకు ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డులు ఉన్నాయని, ఇప్పటి వరకు రూ.146.40 కోట్ల మేర కూలీ డబ్బు చెల్లించామన్నారు. 5 వేల కుటుంబాలు వందరోజులు పనిదినాలు పూర్తి చేశారన్నారు. అనంతరం అమృత్ సరోవర్ పథకం కింద చేపట్టిన వాటర్ షెడ్లు, వైఎస్సార్ జలకళ పథకాల ప్రగతి నివేదికలను కేంద్ర బృందానికి అందించారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా జెడ్పీ సీఈఓ సూర్యనారాయణ, డ్వామా పీడీ రామాంజనేయులు, డీపీఓ విజయకుమార్, గృహనిర్మాణ శాఖ అధికారి నాగరాజుతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. కాగా ఎన్‌ఎల్‌ఎం సభ్యులు 29వ తేదీ (ఆదివారం) ఎన్‌పీకుంట మండలం మరకమద్ది గ్రామపంచాయతీలో, 30న ఎన్‌పీకుంటలో పర్యటించి వివిధ పథకాలు అమలు తీరును తెలుసుకోనున్నట్లు కలెక్టరేట్ వర్గాలు తెలిపాయి.

పథకాల అమలు తీరు భేష్
చిలమత్తూరు: ప్రభుత్వ పథకాల అమలు జిల్లాలో పారదర్శకంగా సాగుతోందని ఎన్‌ఎల్‌ఎం బృందం కితాబు ఇచ్చింది. మండలంలో ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో చేపడుతున్న పనులను శనివారం జాతీయ స్థాయి బృంద సభ్యులు(ఎన్‌ఎల్‌ఎం) పరిశీలించారు. తొలుత బృందం సభ్యులు ప్రదీప్‌కుమార్, సంతోష్ కుమార్ ప్రదాస్ సోమఘట్ట పంచాయతీలో పర్యటించారు. రైతు భరోసా కేంద్రం వద్ద స్వయం సహాయ సంఘాల మహిళలు, సామాజిక పింఛన్ లబ్ధిదారులతో మాట్లాడారు. ఉపాధిహామీ పథకం ద్వారా మండలంలో చేపట్టిన పనుల పురోగతిని పరిశీలించారు. పింఛన్ మంజూరు, 1వ తేదీ పింఛన్ పంపిణీ తీరును లబ్ధిదారులతో మాట్లాడి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రభుత్వ పథకాల అమలు జిల్లాలో పకడ్బందీగా సాగుతోందన్నారు.



సోమఘట్ట వద్ద పండ్ల తోటను పరిశీలిస్తున్న జాతీయ స్థాయి బృందం

ఎస్టీల్లో చేరిస్తేనే వాల్మీకుల జీవితాల్లో వెలుగు



సమావేశంలో పాల్గొన్న వాల్మీకి, బోయ కులస్తులు



మాట్లాడుతున్న శామ్యూల్ ఆనంద్, చిత్రంలో ఎంపీ రంగయ్య, కలెక్టర్ బసంత్‌కుమార్

- ఏకసభ్య కమిషన్‌కు విన్నవించిన వాల్మీకులు

పెనుకొండ: అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్న తమను ఎస్టీ జాబితాలో చేర్చాలని, అప్పుడే తమ జీవితాల్లో వెలుగు నిండుతాయని పలువురు వాల్మీకి, బోయ కులస్తులు ఏకసభ్య కమిషన్‌కు విన్నవించారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే అంశంలో భాగంగా వాల్మీకుల జీవన స్థితగతులను తెలుసుకునేందుకు ప్రభుత్వం విశ్రాంత ఐఏఎస్ శామ్యూల్ ఆనంద్ నేతృత్వంలో ఏకసభ్య కమిషన్ వేసింది. ఈ క్రమంలో ఏకసభ్య కమిషన్ శనివారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఆవరణలోని భువన విజయం సమావేశ మందిరంలో వాల్మీకులు, బోయలతో సమావేశమైంది. ఈ సమావేశంలో కలెక్టర్ బసంత్‌కుమార్, అనంతపురం ఎంపీ తలారి రంగయ్య, సబ్ కలెక్టర్ కార్తీక్, బీసీ సంక్షేమ అధికారి నిర్మలాజ్యోతి, లైజనింగ్ అధికారులు మస్తానయ్య, రాజకుల్లాయప్ప, సత్యనారాయణ, వాల్మీకి, బోయ కుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాల్మీకి రిజర్వేషన్ పోరాట కమిటీ కన్వీనర్ కోనాపురం ఈశ్వరయ్య, నేతలు అంబికా లక్ష్మీనారాయణ, పొగాకు రామచంద్ర, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీరాములు, వెంకటరత్నం, అంకే లక్ష్మన్న, భూలక్ష్మి, ఇంజినీర్ జగదీష్, నీరగంటి చంద్ర, హనుమంతు, న్యాతప్ప, టీచర్ శివయ్యతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన వాల్మీకులు, కుల సంఘాల నాయకులు ఏకసభ్య కమిషన్‌కు తమ వినతులు అందించారు.

అర్థం చేసుకుని ఆదరించండి..
ఎలాంటి కులవృత్తిలేని తాము, ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస పోతున్నామని పలువురు వాల్మీకులు ఏక సభ్య కమిషన్ ఎదుట వాపోయారు. దేశంలోని పలు రాష్ట్రాల్లో వాల్మీకులు ఎస్టీ జాబితాలో ఉన్నారని, కర్ణాటకలోని వాల్మీకులను ఎస్టీలుగా పరిగణిస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఏజెన్సీ ప్రాంతంలో నివసిస్తున్న ఐదు జిల్లాల్లోని వాల్మీకి, బోయలను ఎస్టీలుగా గుర్తించారన్నారు. రాయలసీమ జిల్లాల్లో మాత్రం బీసీలుగా ఉన్నారనన్నారు. బీసీ (ఏ) జాబితాలో ఉండడం వల్ల ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనుకబడి ఉన్నామన్నారు. వాల్మీకుల దుర్భర స్థితిని అర్థం చేసుకుని ఎస్టీ జాబితాలో చేర్చి ఆదరించాలని కోరారు.

వాల్మీకులను చేరిస్తే రిజర్వేషన్ శాతం పెంచాలి
వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చడంపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, అయితే అంతకుముందు ఎస్టీ రిజర్వేషన్ శాతం పెంచాలని పలువురు ఎస్టీలు ఏకసభ్య కమిషన్ చైర్మన్ శామ్యూల్ ఆనంద్‌ను కోరారు. కార్యక్రమంలో ఎస్టీ సంఘాల నాయకులు హరిలాల్ నాయక్, భాస్కర్ నాయక్, అంజయ్య నాయక్, శ్యామ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కగ్గల్లులో చెన్నై ఐఐటీ బృందం


పాఠశాలలో ఆర్‌ఓ వాటర్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న ప్రత్యేక బృందం

హిందూపురం టౌన్: మండల పరిధిలో కగ్గల్లు గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను శనివారం చెన్నైకు చెందిన ప్రత్యేక బృందం పరిశీలించింది. మద్రాస్ ఐఐటీ ప్రొఫెసర్ డాక్టర్ వీవీ రావు, అతని బృందం ఆర్‌ఓ వాటర్ ప్లాంట్‌ను పరిశీలించారు. వాటర్ ప్లాంట్ నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్‌ఓ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసిందని వారికి ఎంఈఓ గంగప్ప వివరించారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

పుట్టపర్తి టౌన్: పౌష్టికాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని జిల్లా ఎన్‌సీడీ (అసాంక్రామిక వ్యాధులు) వైద్యాధికారి డాక్టర్ నివేదిత పేర్కొన్నారు. పుట్టపర్తి అర్బన్ ఆరోగ్య కేంద్రం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాలను శనివారం ఆమె సందర్శించారు. రక్త హీనత, వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆకుకూరలు, కాయగూరలు తక్కువ ఖర్చులో లభించే పోషకాలన్నారు. వసతి గృహాల్లో విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని, మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యాధికారి ఫణీంద్ర, సీహెచ్‌ఓ నగేష్, సూపర్‌వైజర్ నాగరత్నమ్మ, వార్డెన్ శ్రీదేవి, హెచ్‌ఎం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పరిగి: మండలంలోని కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో అశ్వర్థప్ప(27) అనే వ్యక్తి మృతి చెందాడు.స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. సోమందేపల్లి మండలానికి చెందిన అశ్వర్థప్ప, మనోజ్, చిన్నాలు ద్విచక్రవాహనంపై శనివారం మధ్యాహ్నం పరిగి మండలం మోదాకు వచ్చారు. అశ్వర్థప్పకు మోదాలో పెళ్లి కావడంతో అత్తారింటికి అతనితో పాటు మిగిలిన ఇద్దరు వచ్చారు. సరిహద్దు ప్రాంతమైన కర్ణాటకకు పని మీద ద్విచక్రవాహనంపై బయలుదేరారు.ఈ క్రమంలో చెర్లోపల్లి గేట్ దాటగానే బైకు అదుపు తప్పడంతో ముగ్గురూ పక్కన ఉన్న కాలువలో పడిపోయారు. దీంతో వెనక కూర్చున్న అశ్వర్థప్ప అక్కడికక్కడే మరణించాడు. మనోజ్, చిన్నాకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా


పతకాలు చూపుతున్న విజేతలతో ముఖ్య అతిథులు


మాట్లాడుతున్న రాగే హరిత

- నందడిగా బాలోత్సవం
- సాంస్కృతిక నృత్యాలతో పిల్లల హుషారు

అనంతపురం కల్చరల్: అనంతపురం వేదికగా 'బాలోత్సవం' రెండో రోజు శనివారం ఆద్యంతం ఉల్లాసంగా ఉత్సాహంగా సాగింది. వందలాదిగా తరలి వస్తున్న విద్యార్థుల్లో స్ఫూర్తినింపేలా నిర్వహిస్తున్న పోటీలు ఆకట్టుకున్నాయి. ప్రతిభ చాటుకున్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, పతకాలను అందజేశారు. అవధుల్లేని ఆనందాల పండుగ ఆదివారంతో ముగియనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

జాలు వారిన ప్రతిభ..

పెద్దలకే పరిమితమైన పౌరాణికం, శాస్త్రీయ దృక్పథం, చరిత్రాత్మకం, వైజ్ఞానిక విషయాలతో కథాగమనాన్ని చిన్నారులు చక్కగా నడిపించారు. వందల ఏళ్ల నుంచి భూమిపై వెలసిన విషయాలను పూసగుచ్చినట్టు మెమొరీ టెస్టులో వివరించి మనసు దోచుకున్నారు. శాస్త్రీయ నృత్యాలతో అలరించారు. వక్తృత్వంలో, ఆలోచనాత్మకంగా వ్యాసరచనలో, దేశభక్తుల మాటలు గుర్తొచ్చేలా ఏకపాత్రాభినయాలతో ఆకట్టుకున్నారు. వ్యర్థాలతో అర్థవంతమైన వస్తువులను సృష్టించి ఔరా అనిపించారు. సినీ, జానపద నృత్యాలతో హోరెత్తించారు. వీనుల విందైన సంగీతంతో మంత్ర ముగ్ధులను చేశారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా రియాజుద్దీన్, మధురశ్రీ, అంకె శ్రీనివాస్, వన్నూరు మాస్టర్, కుంచె లక్ష్మీనారాయణ, డాక్టర్ నాసీల నాగేంద్ర వ్యవహరించారు.

బాలల ఉత్సవం నిర్వహణ అభినందనీయం..

చిన్నారుల్లో దాగి ఉన్న సృజనను వెలికి తీసేలా బాలోత్సవాన్ని నిర్వహించడం ప్రశంసనీయమంటూ నిర్వాహకులను రాష్ట్ర నాటక అకాడమీ చైర్‌పర్సన్ రాగే హరిత అభినందించారు. శనివారం నిర్వహించిన పోటీల్లో విజేతలకు సాయంత్రం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు పెద్దన్న గౌడ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె విశిష్ట అతిథిగా హాజరై మాట్లాడారు. మానసిక ఒత్తిడి నుంచి దూరమయ్యేందుకు చిన్నారులకు బాలోత్సవం వేదికైందన్నారు. కార్యక్రమంలో ప్రముఖ నాట్యాచార్యులు సంధ్యామూర్తి, పట్నం శివప్రసాద్, ఐద్వా సావిత్రి, సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్, యూటీఎఫ్ నేత జిలాన్‌బాషా, రామన్న, డాక్టర్ సుమన్‌కుమార్, నబీరసూల్ తదితరులు పాల్గొన్నారు.

నేలను సంరక్షిద్దామంటూ పాదయాత్ర


పవన్‌కుమార్‌ను సన్మానిస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

పరిగి: నేలను సంరక్షిద్దామంటూ కశ్మీర్ నుంచి కన్యాకుమారికి మండలంలోని పైడేటి గ్రామానికి చెందిన పవన్‌కుమార్ పాదయాత్ర చేపడుతున్నాడు. శనివారం ఆయన యాత్ర మండలానికి చేరింది. కలెక్టర్ బసంత్‌కుమార్ ఆదేశాల మేరకు మండల అధికారులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దారు సౌజన్యలక్ష్మీ, ఎంపీడీఓ సరస్వతి, ఎంపీపీ సవిత, ఎంఈఓ లక్ష్మీదేవి, మండల వ్యవసాయాధికారి విజయభారతి తదితరులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పవన్‌కుమార్ మాట్లాడుతూ 'సేవ్ సాయిల్' నినాదంతో గతేడాది ఆగస్టు 17న జమ్మూలోని తావి అనే గ్రామం నుంచి కాలినడక ప్రారంభించానన్నారు. భూమి, పర్యావరణ పరిరక్షణ, సేంద్రియ ఎరువుల వాడకంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకే పాదయాత్ర చేస్తున్నట్లు పేర్కొన్నారు. అన్ని రాష్ట్రాల్లోనూ ప్రజలు ఘన స్వాగతం పలికి సన్మానించినట్లు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ భాగస్వాములైనప్పుడే తన సంకల్పం నెరవేరుతుందని చెప్పారు. ఎంతో బాధ్యతతో పవన్‌కుమార్ చేపడుతున్న పాదయాత్ర విజయవంతం కావాలని అధికారులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు లక్ష్మీనరసింహం, వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ సెల్ కార్యదర్శి ప్రభాకర్, సర్పంచ్ మంజునాథ్‌రెడ్డి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో మానవులకు మేలు


చిరుధాన్యాలను పరిశీలిస్తున్న డీఏఓ సుబ్బారావు

గుడిబండ: చిరుధాన్యాల్లో ఔషధ గుణాలు ఎక్కువగా ఉండడంతో మానవులకు ఎంతో మేలు చేస్తాయని జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) వై.వి.సుబ్బారావు తెలిపారు. శనివారం మండల పరిధిలోని సి.సి.గిరి గ్రామంలో అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం- 2023 కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు చిరుధాన్యాలను సేంద్రియ ఎరువులను ఉపయోగించి పండించాలన్నారు. దీంతో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ఖరీఫ్‌లో 250 ఎకరాల రాగి పంటలో క్లస్టర్‌స్థాయి ప్రదర్శన క్షేత్రాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విత్తనాల దగ్గరి నుంచి పంట కోత వరకు చేపట్టాల్సిన వ్యవసాయ పనులపై సాంకేతిక సూచనలు ఇస్తామన్నారు. చిరుధాన్యాల సాగుతో అధిక దిగుబడితో పాటు మార్కెట్ ధర స్థిరంగా ఉంటుందన్నారు. వీటిని రోజూ తీసుకుంటే అనారోగ్య సమస్యలు దూరమవుతాయన్నారు. కార్యక్రమంలో మడకశిర వ్యవసాయ సంచాలకులు కృష్ణమీనన్, మండల వ్యవసాయ అధికారి తిమ్మప్ప, సర్పంచ్ యంజారేగౌడు తదితరులు పాల్గొన్నారు.

పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

అనంతపురం సప్తగిరి సర్కిల్: జాతీయ క్షయ నివారణ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఖాళీగా ఉన్న సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్(ఎస్టీ మహిళ), టీబీ హెల్త్ విజిటర్ (మహిళ వీహెచ్, ఓసీ జనరల్) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌ను విడుదలైంది. ఈ మేరకు జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ అనుపమ జేమ్స్ శనివారం తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ సాయంత్రం 5 గంటలల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు httpr://ananthapuramu.ap.gov.inను పరిశీలించాలన్నారు.

ఘనంగా చైనీస్ నూతన సంవత్సర వేడుకలు


మార్షల్ ఆర్ట్స్‌ను ప్రదర్శిస్తున్న బాలవికాస్ చిన్నారులు


ప్రసంగిస్తున్న ఇసబెల్లా చూ

ప్రశాంతి నిలయం: ప్రపంచ ఆధ్యాత్మిక క్షేత్రమైన పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయం వేదికగా చైనీస్ నూతన సంవత్సర వేడుకలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. చైనీస్ సంస్కృతిని ప్రతిబింబించే రీతిలో సాయికుల్వంత్ మందిరాన్ని అలంకరించారు. మహాసమాధి వద్ద విశేష పూజల అనంతరం కార్యక్రమాలను సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్ రాజు ప్రారంభించారు. వేడుకల్లో హాంగ్‌కాంగ్, మలేషియా, జపాన్, ఇండోనేషియా, సింగపూర్, తైవాన్ దేశాలకు చెందిన వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఆయా దేశాలకు చెందిన బాలవికాస్ విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వేడుకల కో-ఆర్డినేటర్‌గా వ్యవహరిస్తున్న హాంగ్‌కాంగ్‌కు చెందిన ఇసబెల్లా చూ మాట్లాడుతూ.. సత్యసాయి మహిమాన్విత ఘట్టాలతో పాటు చైనీస్ నూతన సంవత్సర వేడుకల ప్రాముఖ్యతను వివరించారు.

నేటి నుంచి కొండమీద రాయుని బ్రహ్మోత్సవాలు

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని దేవరకొండపై ఆదివారం నుంచి కొండమీదరాయుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. లక్ష్మీ నారాయణస్వామి దేవాలయం నుంచి ఉత్సవ విగ్రహాలను సాయంత్రం కొండపైకి తీసుకెళ్తారు. సోమవారం ఉదయం ఎనిమిది గంటలకు దేవరకొండపై ఉత్సవ విగ్రహాలకు పుణ్యావచనం, అంకురార్పణ, దేవతా హోమాలు, ధ్వజారోహణం, గరుడ ఆహ్వాన పూజ నిర్వహిస్తారు. అదే రోజున రాత్రి ఎనిమిది గంటలకు స్వామి వారికి పుష్ప పల్లకీ సేవ నిర్వహించనున్నారు. 31న రాత్రి 8 గంటలకు స్వామి వారిని సింహ వాహనంపై పుర వీధుల్లో ఊరేగిస్తారు. ఫిబ్రవరి ఒకటో తేదీ రాత్రి ఎనిమిది గంటలకు స్వామి శేష వాహనంపై భక్తులకు దర్శనమిస్తారు. రెండో తేదీ రాత్రి హనుమద్ వాహనంపై విహరిస్తారు. మూడో తేదీ రాత్రి గరుడ వాహనంపై ఊరేగుతారు. నాల్గో తేదీ రాత్రి గజ వాహనంపై ఊరేగిస్తారు. ఐదో తేదీ వేకువజామున నాలుగు గంటలకు శ్రీవారి కల్యాణోత్సవం నిర్వహిస్తారు. ఉదయం 11.30 గంటలకు సూర్యప్రభ వాహనంపై గరుడాద్రి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో లక్ష్మీనారాయణ స్వామి దేవాలయం నుంచి పుర వీధుల్లో ఊరేగించనున్నారు. మధ్యాహ్నం బుక్కరాయసముద్రంలో బ్రహ్మ రథోత్సవం నిర్వహిస్తారు. ఆరో తేదీన రాత్రి అశ్వవాహనంపై ఊరేగిస్తారు. ఏడో తేదీ ఉదయం ఏడు గంటలకు తీర్థవాది వసంతోత్సవం నిర్వహించి, రాత్రి ఏడు గంటలకు స్వామి వారిని హంస వాహనంపై ఊరేగిస్తారు.

సీమకు న్యాయం చేయండి

అనంతపురం సప్తగిరి సర్కిల్: రాయలసీమలో రాజధానిని కాని, హైకోర్టును కాని ఏర్పాటు చేసి న్యాయం చేయాలని రాయలసీమ విమోచన సమితి అధ్యక్షుడు రాజశేఖరరెడ్డి డిమాండ్ చేశారు. మూడు రాజధానుల ఏర్పాటు అంశంపై ఎస్కేయూలో శనివారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. 1953లో ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రంగా ఉన్నప్పుడు కర్నూలు రాజధానిగా ఉండేదని, 1956లో హైదరాబాద్‌ను రాజధానిగా చేసి రాయలసీమ ప్రాంతానికి తీవ్ర అన్యాయం చేశారని గుర్తు చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ రాయలసీమ ప్రాంతం అన్నింటా వెనుకబాటుకు గురవుతూ వస్తోందని వాపోయారు.

సహకార డెయిరీ వ్యవస్థకు జీవం

- రాప్తాడు నియోజకవర్గ మహిళలకు ఇచ్చిన మాట నెరవేరబోతోంది
- తోపుదుర్తి మహిళా సహకార డెయిరీ త్వరలో ప్రారంభం
- రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడు రూరల్: గత ప్రభుత్వ హయాంలో జీవచ్ఛవంలా మారిన సహకార డెయిరీ వ్యవస్థకు మళ్లీ జీవం పోసేలా రాప్తాడు నియోజకవర్గంలో తోపుదుర్తి సహకార డెయిరీ ఏర్పాటుకు శ్రీకారం చుట్టినట్లు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. అనంతపురం మండలం ఆలమూరు జగనన్న లేఅవుట్ సమీపంలోని తోపుదుర్తి మహిళా సహకార డెయిరీలో శనివారం సభ్యులతో ఆయన సమావేశమై మాట్లాడారు. నియోజకవర్గవ్యాప్తంగా 10 వేల మంది మహిళా పాడి రైతులకు ఉపాధి కల్పించాలనే కల నెరవేరబోతోందన్నారు. ఈ క్రమంలో ఎన్నో విమర్శలు, అవమానాలు ఎదురైనా అక్క, చెల్లెమ్మల కోసం ఎంతో ఆత్మస్థైర్యంతో ముందడుగు వేశానన్నారు. డెయిరీ ఏర్పాటుకు అనువుగా ఉంటుందని రాప్తాడు సమీపంలో జాతీయ రహదారి పక్కనే ఉన్న భూమిని అడిగితే ఎమ్మెల్యే కాజేసేందుకంటూ కొందరు మాట్లాడడం బాధకలిగించిందన్నారు. డెయిరీలో సభ్యత్వం కోసం చెల్లించిన డబ్బుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని మాజీ మంత్రి పరిటాల సునీత, ఆమె కొడుకు శ్రీరామ్ బాధ్యత లేకుండా మాట్లాడుతూ తప్పుడు ప్రచారం చేశారన్నారు. డెయిరీ ఏర్పాటుకు రూ.17 కోట్ల వరకు ఖర్చైందని, ఎవరెన్ని ఆరోపణలు చేసినా పాడి రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని రానున్న రోజుల్లో మరిన్ని ప్రాంతాల్లో సహకార డెయిరీలు ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. ఇందు కోసం తన కుటుంబసభ్యులంతా ఎంతో బాధ్యతాయుతంగా పని చేస్తున్నారన్నారు. డెయిరీ చైర్‌పర్సన్ తోపుదుర్తి నయనతారెడ్డి మాట్లాడుతూ...సహకార డెయిరీ ఏర్పాటు విషయంలో నాలుగేళ్లుగా ఎదుర్కొన్న ఇబ్బందులను వివరించారు. మహిళలు ఆర్థిక స్వాతంత్ర్యం సాధించాలనే సంకల్పంతో డెయిరీని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి మాట్లాడుతూ.. సహకార డెయిరీ ఏర్పాటుతో మహిళా రైతులు లాభాల బాటలో పయనించనున్నారన్నారు. జిల్లాలోనే అతి పెద్ద డెయిరీ ఇదే అవుతుందన్నారు. ఎమ్మెల్యే దూరదృష్టితో ఆలోచించి రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మహిళల ఉపాధికి డెయిరీ ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు. సమావేశంలో ఏపీడీ తులసీరామరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ జనార్దనరెడ్డి, రాప్తాడు మార్కెట్ యార్డ్ చైర్మన్ బెడదూరి గోపాలరెడ్డి, మాజీ చైర్మన్ తాటిచెర్ల నాగేశ్వరరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ బండి పవన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు


అవగాహన కల్పిస్తున్న అధికారులు

ముదిగుబ్బ: రైతులు ప్రకృతి వ్యవసాయం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రత్యేక పరిశీలకులు మోహన్‌కుమార్ తెలిపారు. శనివారం మండల పరిధిలోని సానేవారిపల్లి క్లస్టర్ పరిధిలో రైతులు సురేంద్రనాయుడు, గంగులప్పల వేరుశనగ పంటలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని పరిశీలించడానికి గుంటూరు కమిషనరేట్ నుంచి ప్రత్యేక పరిశీలకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు సూచనలు, సలహాలు అందించారు. పొలం బడి అంటే ఏంటి, వాటి ద్వారా కలిగే ప్రయోజనాలు తదితర వాటిపై అవగాహన కల్పించారు. లింగాకర్షణ బుట్టలు, పక్షి స్థావరాలు, సాగు చేసిన కంచె పంట, ఎర పంటలను ఆయన పరిశీలించారు. అనంతరం పొలంబడి కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏడీఏ సత్యనారాయణ, ఏఓ లక్ష్మీనరసింహులు, ఆర్‌బీకే సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా రేషన్ బియ్యం

- ఏడాది పాటు అందించాలని సర్కారు నిర్ణయం
- లబ్ధిదారుల ఆనందం



సాక్షి, పుట్టపర్తి: పేద, బడుగు, బలహీన వర్గాలకు రేషన్ బియ్యాన్ని ఏడాది పాటు ఉచితంగా పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ ఏడాది జనవరి నుంచి డిసెంబరు వరకు లబ్ధిదారులు ఉచితంగా బియ్యం తీసుకోవచ్చు. అయితే చక్కెర, కందిపప్పు తదితరాలకు నగదు చెల్లించాల్సి ఉంటుంది. రేషన్ కార్డులోని సభ్యులు ఒక్కొక్కరికి ఐదు కిలోల చొప్పున ఏడాది పాటు బియ్యం అందనున్నాయి. ప్రభుత్వ నిర్ణయంపై కార్డుదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నూతన సంవత్సర కానుకగా ఉచిత బియ్యం అందజేస్తున్నారని సంతోషం వెలిబుచ్చారు.

జిల్లాలో పౌరసరఫరా వివరాలిలా..	
చౌక ధాన్యపు దుకాణాలు	1,367
రేషన్ కార్డులు	5,61,990
ఎంఎల్‌ఎస్ పాయింట్లు	12
ఎండీఎం వాహనాలు	342
నెలలో సరఫరా అయ్యే బియ్యం	8,597 మెట్రిక్ టన్నులు

మిగతా రేషన్‌కు చెల్లించాలి



ప్రభుత్వ ఆదేశాల మేరకు లబ్ధిదారులకు ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తున్నాం. ఏడాది పాటు రూపాయి తీసుకోకుండా సరఫరా చేస్తాం. చక్కెర, కందిపప్పు మాత్రం నిర్ణయించిన ధర చెల్లించాలి.

– వంశీకృష్ణారెడ్డి, పౌరసరఫరాల అధికారి, శ్రీ సత్యసాయి జిల్లా